సాక్షి మెదక్

గురువారం, 25, జూలై, 2024



ప్రాజెక్టులిలా.. వరదొస్తే ఎలా?
ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులు ఈ ఏడాది వర్షాకాల మరమ్మతులకు నోచుకోలేదని తెలుస్తోంది. తూముల నిర్వహణ సరిగా లేదని రైతులు చెబుతున్నారు. వివరాలు 8లో ▸



'మాఫీ' మెసేజ్‌లా?
పంట రుణం తీసుకోలేదు అయినా రుణమాఫీ అయినట్లు రైతులకు సందేశాలు వచ్చాయి. వివరాలు 8లో ▸



కుక్కలతో అవస్థలు
గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా గ్రామాల్లో సంచరిస్తూ దాడులు చేస్తున్నాయి. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



మెదక్ మున్సిపాలిటీ: ప్రజలు ఆశ, భయంతో సైబర్ నేరాలకు గురవుతున్నారని, ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇటీవల తూప్రాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన సైబర్ నేరాన్ని ప్రస్తావించారు. కొరియర్ వచ్చిందని ఓ వ్యక్తి ఫోన్ చేసి చెప్పడం.. అది తనది కాదని చెప్పి క్యాన్సిల్ చేసే క్రమంలో సైబర్ నేరగాడు పన్నిన వలలో చిక్కి రూ. 5,00,000 పోగొట్టుకున్నట్లు తెలిపారు. ప్రస్తుత సమాజంలో సెల్‌ఫోన్‌తో ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో, అన్ని అనర్థాలు కూడా జరుగుతున్నాయని వివరించారు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని సైబర్ నేరగాళ్లు దోచుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ నేరాలపై 1930 అనే టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. బ్యాంకర్లు సైతం తమ ఖాతాదారులకు సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం క్విక్ రియాక్షన్ టీమ్స్ ఏర్పాటు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యమని తెలిపారు. బుధవారం జిల్లా సామాన్యులకు భరోసా కలిగించే విధంగా పోలీసింగ్ ఉంటుందన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ఆస్పత్రి తనిఖీ



వైద్యులు, సిబ్బందితో కాయకల్ప బృందం

రామాయంపేట(మెదక్): రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం కాయకల్ప బృందం తనిఖీ చేసింది. ఆస్పత్రిలో రికార్డులు, వైద్య పరికరాలను పరిశీలించింది. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీసింది. ఆస్పత్రి ఆవరణలో నాటిన మొక్కలతో పాటు బయో మెడికల్ వేస్టేజీ, పారిశుద్ధ్యానికి సంబంధించి రికార్డులను బృందం సభ్యులు పరిశీలించారు. అనంతరం సూపరింటెండెంట్ లింబాద్రి బృందం సభ్యులను సన్మానించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కు ఎదురుగా గల ఎస్సీ స్టడీ సర్కిల్‌లో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి లింగేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షల కోసం అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డిగ్రీ పూర్తి చేసి, వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించని వారు అర్హులన్నారు. ఈనెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. పూర్తి సమాచారం కోసం 040- 23546552, 9849526767, 9908540587 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బైక్ షాపులపై పోలీసుల దాడులు



బైక్‌లను పరిశీలిస్తున్న పోలీసులు

తూప్రాన్: డివిజన్ కేంద్రంలో కొనసాగుతున్న బైక్ జోన్ (సెకండ్ హ్యాండ్ బైక్) దుకాణాలపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. సుమారు 10 దుకాణాల్లో బైక్‌ల విక్రయాలు, కొనుగోళ్లు, ఫైనాన్స్ వ్యవహారాలు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం పోతరాజుపల్లిలో అక్రమంగా దాచిన సుమారు 200 బైక్‌లను గుర్తించి సీజ్ చేశారు. అనంతరం సీఐ రంగకృష్ణ మాట్లాడుతూ.. బైక్ జోన్ నిర్వాహకులు పేద, మధ్య తరగతి కుటుంబాలే టార్గెట్‌గా అధిక వడ్డీలకు ఫైనాన్స్ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని వివరించారు. వీరు విక్రయించే బైక్‌లకు సరైన ధృవపత్రాలు, నంబర్లు లేనట్లుగా తమ తనిఖీల్లో బహిర్గతం అయిందన్నారు. వారు విక్రయిస్తున్న బైక్‌లను సీజ్ చేసి పూర్తి వివరాలు, ధృవపత్రాలు పరిశీలించి చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

సామాజిక స్పృహతోనే..

సివిల్స్ వైపు అడుగులు

నాన్నకు ఇంజినీర్ కావాలని ఉండేది

- ఆయన కోరిక మేరకు మూడేళ్లు ఉద్యోగం చేశా
- ప్రధాన మంత్రి అవార్డు జీవితంలో మరిచిపోలేనిది
- 'సాక్షి'తో కలెక్టర్ రాహుల్‌రాజ్

టర్నింగ్ పాయింట్

మెదక్‌జోన్: 'మొదటి నుంచి సామాన్య ప్రజలకు ఏదో చేయాలని ఉండేది. కానీ నా వద్ద పవర్.. డబ్బు లేదు. నా ఆలోచనను ఆచరణలో పెట్టాలంటే కలెక్టర్ కావడమే ఏకైక మార్గం అని నిర్ణయించుకున్నా. అయితే నాన్నకు ఇంజినీర్ కావాలని ఉండేది.. ఆయన కోరిక మేరకు బీటెక్ పూర్తి చేసి మూడేళ్లు ఉద్యోగం చేశా. అనంతరం ఉద్యోగానికి రాజీనామా చేసి సివిల్స్ రాశా. రెండో ప్రయత్నంలో నా కల నెరవేరిందని' కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. ఇంటర్ చదువుతున్నప్పటి నుంచే సామాజిక అంశాలు సివిల్స్ చదివేలా చేశాయని చెబుతున్న కలెక్టర్‌తో ఈ వారం. 'సాక్షి' టర్నింగ్ పాయింట్.



ప్రధాని మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కలెక్టర్ రాహుల్‌రాజ్ (ఫైల్)

హైదరాబాద్‌లోనే విద్యాభ్యాసం

మాది హైదరాబాద్. అమ్మానాన్నలు సాయిప్రసాదరావు, సాయిజ్యోతిక. అమ్మ హౌస్ వైఫ్, నాన్న కెనరా బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగి. మేము ఇద్దరం సంతానం. తమ్ముడు రోహిత్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. నా స్కూల్ చదువు కూకట్‌పల్లి చింతల్ సిద్దార్థ.. హైస్కూల్, కాలేజ్ నారాయణ కళాశాలలో కొనసాగింది. బీటెక్ జేఎన్‌టీయూ కూకట్‌పల్లిలో చదువుతున్న క్రమంలో మొదటి ర్యాంకు సాధించా. మూడేళ్ల పాటు ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం కూడా చేశా.

మా పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించా

ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో మా పిల్లలను అక్కడి అంగన్‌వాడీ సెంటర్‌లో చేర్పించా. కలెక్టర్ పిల్లలు అంగన్‌వాడీలో చదువుతున్నారంటే వారిని చూసి ఎంతో మంది చేరుతారనే నా ఉద్దేశం. నాకు పీఎం అవార్డు వచ్చినందుకు కేంద్ర ప్రభుత్వం రూ.20 లక్షల అవార్డు ప్రకటించింది. ఆ డబ్బుతో ఆసిఫాబాద్‌లో అన్ని హంగులతో కూడిన అంగన్‌వాడీ భవనం నిర్మించా. అక్కడ వంద అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నపాటి టీవీలను ఏర్పాటు చేసి పిల్లలకు సంబంధించిన ప్రోగ్రాంలు చూపించేలా ఏర్పాటు చేశా.

ప్రసూతి మరణాలు కలిచివేశాయి

ఆసిఫాబాద్‌లో కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో అక్కడ 38 ఏళ్ల ప్రసూతి మహిళ తన నాల్గవ బిడ్డకు జన్మనిచ్చి మృతి చెందింది. అంతకుముందు ఆమెకు ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. నాల్గవ కాన్పులో బిడ్డకు జన్మనిచ్చి అధిక రక్తస్రావంతో చనిపోయింది. ఈ విషయంపై మృతురాలి భర్తను ఆరా తీయగా జిల్లాలో ఇలాంటి మరణాలు చాలా జరుగుతున్నాయని, నా నలుగురు పిల్లలను పెంచడం ఎలా అంటూ బోరున విలపించారు. మరణాలను అరికట్టేందుకు వైద్యులతో మాట్లాడాను. రక్తహీనత, పౌష్టికాహార లోపం అని తేలింది. జిల్లాలో ఆపరిస్థితిని అధిగమించేందుకు ప్రత్యేకంగా చిరుధాన్యాల సాగు (పౌష్టికాహారం)పై దృష్టిసారించా. ఆ గ్రామంలోనే సాగు చేయించి అక్కడే విక్రయించేలా వెసులుబాటు కల్పించాం. పోషణ్ అభియాన్ కింద మహిళలు, పిల్లల సంరక్షణపై ప్రత్యేక దృషిట్ సారించా. గర్భిణులకు ప్రతి నెలా రక్త పరీక్షలు చేసి కావాల్సిన మందులు అందించాలని వైద్యులను ఆదేశించా. డెలివరీ అయ్యే వరకు స్వయంగా వారికి సూచనలివ్వాలని చెప్పా. దీంతో మరణాల రేటు 25 నుంచి 2కు తగ్గింది. దీంతో 2022లో ప్రధానమంత్రి అవార్డును పీఎం నరేంద్ర మోదీ చేతుల మీదుగా అందుకున్నా. ఇది నా జీవితంలో మరిచిపోలేని మధురానుభూతి. ఈ అవార్డు అందుకునేందుకు నా కుటుంబంతో సహా వెళ్లా.

ఎస్‌హెచ్‌సీ గ్రూపులతో థియేటర్ నిర్మాణం

ఆసిఫాబాద్‌లో పని చేస్తున్న సమయంలోనే మహిళా గ్రూపు సభ్యులతో సినిమా థియేటర్‌ను నిర్మింపజేశాం. ఆ థియేటర్‌కు రూ.50 లక్షలు ఖర్చు కాగా, జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు 60 శాతం నిధులు సమకూర్చారు. మరో 40 శాతం నిధులను ఓ ప్రైవేట్ వ్యక్తితో పెట్టించాం. దీని ముఖ్య ఉద్దేశం మహిళలను ఆర్థికాభివృద్ధి వైపు మళ్లించడమే. దీంతో అక్కడ మహిళలు ఎంతో ఆర్థికంగా నిలదొక్కుకొని సంతోషంగా ఉన్నారు. ఇందులో ఆర్‌ఆర్‌ఆర్ సినిమాను రాజమౌళితో కలిసి చూశాం. అలాగే మండల సమాఖ్య సభ్యులతో చిన్న చిన్న కుటీర పరిశ్రమలను సైతం ఏర్పాటు చేయించి ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశాం.

క్షేత్రస్థాయి పరిశీలనపై ఆసక్తి

నాకు క్షేత్రస్థాయి పరిశీలన చేసిన తర్వాతే ఏ విషయమైన పూర్తిగా నమ్ముతా. మెదక్ జిల్లాలో మహిళలు బస్సుల్లో ఇబ్బందులు పడుతున్నట్లు సోషల్ మీడియాలో చూశా. ఇది ఎంత వరకు వాస్తవమని పరిశీలించేందుకు ఇటీవల మెదక్ నుంచి నర్సాపూర్ వరకు కుటుంబంతో కలిసి ప్రయాణించా. మహిళలు బస్సుల్లో చాలా సంతోషంగా ఉన్నారు. నేను పరిశీలించిన బస్సులో పురుషుల కన్నా మహిళలే అధికంగా ఉన్నారు.

వందశాతం ప్లాస్టిక్ నిషేధం!

తాను మెదక్‌కు వచ్చాక ప్లాస్టిక్‌పై పూర్తి నిషేధం విధించాలని నిర్ణయించా. కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ బాటిళ్లు వాడొద్దని ఆదేశాలు జారీ చేశా. మంచి సత్ఫలితాలు వస్తున్నాయి. ఈ ఏడాది ఆగస్టు 15 వరకు వందశాతం అమలు కావలన్నదే నా ఆలోచన. అనంతరం జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తిస్థాయిలో అమలు చేయిస్తా. తద్వారా జిల్లా అంతటా అమలయ్యేలా కృషి చేస్తా.

మాది ప్రేమ వివాహం

మహిళల హక్కులను గౌరవించేవాడిలో నేనొకరిని. సివిల్స్ సాధించగానే ఎంతో మంది కోట్లాది రూపాయల వరకట్నం ఇస్తామని వచ్చారు. కానీ నేను ఇష్టపడిన అమ్మాయినే పెళ్లి చేసుకున్నా. మాది పెద్దలు కుదిర్చిన ప్రేమ వివాహం. అప్పు చేసి పెళ్లి చేసుకున్నా. నా భార్య బ్యాంకు ఉద్యోగి. కలెక్టర్ భార్య ఉద్యోగం చేస్తుందా..? అని చాలా మంది అనుకుంటారు. ఉద్యోగం చేయడం నా భార్యకు ఇష్టం కాబట్టి చేస్తుంది.



సతీమణితో కలెక్టర్ రాహుల్‌రాజ్

రైతులకు న్యాయం చేయండి

- రుణమాఫీకి సాంకేతికత అడ్డుకావొద్దు
- కలెక్టర్ రాహుల్‌రాజ్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: సాంకేతిక కారణాలతో రైతుల రుణమాఫీ ఆగకూడదని, ఇండియన్ బ్యాంకులో నెలకొన్న సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, లీడ్ బ్యాంకు మేనేజర్ నరసింహమూర్తి, జిల్లా కోపరేటివ్ అధికారి కరుణతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో రుణమాఫీ సమస్యలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలన్నారు. రుణమాఫీ జరగకపోతే మండల లేదా జిల్లా వ్యవసాయ అధికారులను సంప్రదించాలని రైతులకు సూచించారు.

మెరుగైన పరిహారం కోసం కృషి

నర్సాపూర్: ట్రిపుల్‌ఆర్ కోసం భూములు కోల్పోతున్న రైతులకు మెరుగైన పరిహారం ఇచ్చేందుకు కృషి చేస్తానని కలెక్టర్ రైతులకు హామీ ఇచ్చారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో రత్నాపూర్, చిన్నచింతకుంట గ్రామాలకు చెందిన రైతులతో సమావేశం నిర్వహించారు. భూముల సేకరణకు రైతు లు సహకరించాలని కోరారు. రోడ్డు కోసం భూమి కోల్పోతున్న రైతులకు భూమికి భూమి ఇవ్వాలని పలువురు కోరారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయండి

నర్సాపూర్ రూరల్: ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి సిద్ధం చేసి ప్రతిపాదనలు తయారు చేయాలని నర్సాపూర్ రెవెన్యూ అధికారులకు కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. బుధవారం మండలంలోని జక్కపల్లిలో ఆర్డీ ఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ కమలాద్రి, ఇతర రెవెన్యూ సిబ్బందితో కలిసి స్థలాన్ని పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా ల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని ప్రభుత్వం పూనుకుందని వివరించారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

హాస్టళ్లకు నాణ్యమైన బియ్యం

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని వసతి గృహాలకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పౌర సరఫరాల విజిలెన్స్ కమిటీతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా పంపిణీ జరుగుతున్న పీడీఎస్ కార్డు, క్వాలిటీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాలకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని, క్షేత్రస్థాయిలో సమస్యలను ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లా లీగల్ మెట్రాలజీ శాఖ ద్వారా రేషన్‌షాపులో ఉన్న ప్రతి వేయింగ్ మిషన్ తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా తేడాలు ఉంటే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్‌కు నాణ్యత బియ్యం డెలివరీ చేయాలని, టెక్నికల్ అసిస్టెంట్లు నిత్యం క్వాలిటీ చెక్ చేయించాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, సివిల్ సప్లై డీఎం హరికృష్ణ, డీఆర్డీఓ శ్రీనివాసరావు, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి బ్రహ్మాజీ, లీగల్ మెట్రాలజీ అధికారి సుధాకర్, షెడ్యూల్ కులాల అధికారి విజయలక్ష్మి, ఇతర శాఖ ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాలుడి మృతిపై ఆందోళన

వ్యాక్సిన్ వికటించిందని కుటుంబీకుల ఆరోపణ

పెద్దశంకరంపేట(మెదక్): వ్యాక్సిన్ వికటించడంతోనే బాలుడు మృతిచెందాడని ఆరోపిస్తూ బాధిత కుటుంబీకులు ఆందోళన నిర్వహించిన సంఘటన పేట ప్రభుత్వ ఆస్పత్రి వద్ద చోటుచేసుకుంది. టేక్మాల్ మండలం వెల్పుగొండకు చెందిన రాములు, మల్లేశ్వరి దంపతులకు మూడు నెలల క్రితం కుమారుడు బాలుడు ధృవ జన్మించాడు. ఆమె ప్రస్తుతం పెద్దశంకరంపేట మండలం బద్దారంలో తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. బుధవారం ఉదయం మల్కాపూర్ సబ్ సెంటర్‌లో మూడో నెల వ్యాక్సిన్ (పెంటావాలెట్)ను తల్లి వేయించింది. ఇంటికి వెళ్లిన కొద్దిసేపటికి బాలుడు ఇబ్బంది పడుతున్నట్లు గమనించి పేట పీహెచ్‌సీకి తీసుకొచ్చింది. అప్పటికే పల్స్ పడిపోవడంతో బాలుడు మృతిచెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. అయితే వ్యాక్సిన్ వికటించడంతోనే మృతిచెందాడని కుటుంబీకులు, గ్రామస్తులు పీహెచ్‌సీ ఎదుట ఆందోళన నిర్వహించారు. అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి పీహెచ్‌సీకి చేరుకొని కుటుంబీకులను సముదాయించారు. ఇదే విషయమై ఆస్పత్రి వైద్యురాలు వేదశ్రీని వివరణ కోరగా పోస్టుమార్టం నివేదిక ఆధారంగా విచారణ చేపడుతామని తెలిపారు.



బాలుడి మృతదేహం

మంచం పట్టిన సుతారిపల్లి

ఇంటింటా జ్వర పీడితులే..



జ్వరంతో బాధపడుతున్న బాలుడు



ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బాధితులు

రామాయంపేట(మెదక్): జ్వరాలు, కీళ్ల నొప్పులతో మండలంలోని సుతారిపల్లి మంచం పట్టింది. కనీసం వంద మందికి పైగా జ్వరంతో ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసినా తగ్గుముఖం పట్టలేదు. దీంతో బాధితులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. 20 రోజులుగా తాము జ్వరంతో బాధపడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా పారిశుద్ధ్యం

గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ఇళ్ల ముందే పెంట కుప్పలు, మేకల కొట్టాలు, మురుగు కాలువలు శిథిలమై రోడ్డుపై ప్రవహిస్తున్న నీటితో దోమల బెడద నెలకొంది. పలుచోట్ల తాగు నీరు సైతం కలుషితమవుతోంది. అంతర్గత రహదారులపై గడ్డి, చెత్తా చెదారం పేరుకుపోయి నీరు నిలుస్తోంది. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో పాటు గ్రామ కార్యదర్శి ఇటీవలే బదిలీపై వెళ్లిపోగా పట్టించుకునే వారు కరువయ్యారు.

ప్రైవేట్ ఆస్పత్రులకు క్యూ..

జ్వరం, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న బాధితులు ప్రైవేట్ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. వీరిలో కొందరు రామాయంపేట, మరికొందరు సిద్దిపేట, కామారెడ్డి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. సమీపంలో ఉన్న ప్రగతి ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లడానికి ఇష్టపడడం లేదు. గ్రామంలో కనీసం వారం రోజుల పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేస్తే జ్వరాలు తగ్గుముఖం పడుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే మిషన్ భగీరథ అధికారులు తాగు నీటి పరీక్షలు నిర్వహించారు.

గ్రామమంతా ఇదే పరిస్థితి



20 రోజులుగా జ్వరంతో ఇబ్బంది పడుతున్నా. ఆస్పత్రికి వెళ్లినా తగ్గడం లేదు. గ్రామమంతా ఇదే పరిస్థితి నెలకొంది. అధికారులు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు అందించాలి.

– పున్న రాజు, బాధితుడు

ఆందోళన చెందొద్దు

ఇప్పటికే గ్రామానికి డాక్టర్, వైద్య సిబ్బందిని పంపించాం. అవసరమైతే క్యాంపు ఏర్పాటు చేసి వైద్య సేవలందిస్తాం. గ్రామస్తులు ఆందోళన చెందొద్దు. జ్వర పీడితుల ఇళ్ల వద్దకు వెళ్లి రక్త నమూనాలు సేకరించాలని సిబ్బందిని ఆదేశించాం.

– శ్రీరాం, డీఎంహెచ్‌ఓ

డెంగీ, మలేరియాపై అప్రమత్తం: డీఎంహెచ్‌ఓ

పాపన్నపేట(మెదక్): డెంగీ, మలేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ శ్రీరాం సూచించారు. బుధవారం పాపన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం దోమల వ్యాప్తి పెరిగే అవకాశం ఉందని.. వర్షపు నీరు నిల్వ ఉండే చోట ఆయిల్‌బాల్స్ వేయాలన్నారు. అలాగే కాచి చల్లార్చిన నీటినే తాగాలని చెప్పారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించారు. ఆయనతో పాటు వైద్యాధికారి హరిప్రసాద్, సీహెచ్‌ఓ చందర్ తదితరులు ఉన్నారు.



పాపన్నపేట పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ శ్రీరాం

క్లుప్తంగా

4 వేల శునకాల గుర్తింపు

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలో కుక్కల బెడద నివారణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ను తిరిగి ప్రారంభించి వినియోగంలోకి తేవాలని నిర్ణయించారు. అధికారుల సర్వే మేరకు పట్టణంలో 4 వేల వీధి కుక్కలను పట్టి జనన నియంత్రణ ఆపరేషన్లు చేయాల్సిన అవసరం ఉందని గుర్తించారు. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, కమిషనర్ ప్రసన్న రాణి, వైస్ చైర్మన్ కనకరాజు, పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

దొంగకు దేహశుద్ధి



పొలంలో పడేసిన హుండీ

శివ్వంపేట(నర్సాపూర్): ఆలయంలోని హుండీని చోరీ చేసి వెళ్తూ బ్యాంకు ఏటీఎంలో, ఆటో చోరీకి విఫలయత్నం చేసిన వ్యక్తిని యువకులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని చండీలోని ఎల్లమ్మ ఆలయ హుండీని దొంగలించి సమీప వ్యవసాయ పొలాల్లో ధ్వంసం చేసి అందులోని నగదుని ఎత్తుకెళ్లాడు. అక్కడి నుంచి శివ్వంపేట ఇండియన్ బ్యాంకు వద్దనున్న ఏటీఎంలో చోరీకి ప్రయత్నించాడు. అలాగే కొద్ది దూరంలో శ్రీకాంత్‌యాదవ్‌కు చెందిన ఆటో ఇంటి వద్ద పార్కింగ్ చేసి ఉంచగా దొంగలించేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో శబ్దం రావడంతో గమనించిన అతని కుటుంబ సభ్యులు, పలువురు యువకులు.. దొంగ పారిపోతుండగా వెంట బడి పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. విచారించగా దుండిగల్ తండాకు చెందిన పరంసింగ్ నాయక్ గా గుర్తించారు. చెండీ ఎల్లమ్మ ఆలయ హుండీ చోరీపై ఆలయ నిర్వాహకుడు నల్లవల్లి కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ముగ్గురి అదృశ్యం

ఉమ్మడి మెదక్‌లో.. ముగ్గురు అదృశ్యమయ్యారు. అందులో వృద్ధురాలు, వృద్ధుడు, బాలిక ఉన్నారు.



నర్సవ్వ (ఫైల్)

మద్దూరు(హుస్నాబాద్): మతిస్థిమితం తప్పిన వృద్ధురాలు ఇంటి నుంచి తప్పిపోయిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. మద్దూరు మండలం రేబర్తికి చెందిన గొట్టం నర్సవ్వ (65) బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఆమె కుమారుడు గొట్టం భూపతిరెడ్డి తెలిపారు. గొట్టం నర్సవ్వ ఆచూకీ తెలిస్తే తమకు సమాచారం అందించాలని భూపతిరెడ్డి (99120–34975) తెలిపారు.

పటాన్‌చెరు టౌన్: కూరగాయలకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన భానూర్–బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కర్ణాటక బళ్లారికి చెందిన 8 మంది పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామానికి చెందిన బంటు బాలయ్య పొలంలో పని చేసేందుకు గత శుక్రవారం వచ్చారు. అందులో ఈనెల 20న కూరగాయలకు వెళ్తున్నానని దళావై పోతులింగ(56) చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో మరియమ్మ భర్త కోసం స్థానికంగా, గ్రామంలో వెతకగా ఆచూకీ లభించలేదు. అతడి అదృశ్యంపై ఆమె బుధవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అలాగే పటాన్‌చెరు మండలం పాశమైలారానికి బతుకుదెరువు కోసం వచ్చిన బిహార్‌కు చెందిన 17 ఏళ్ల మైనర్ బాలిక మంగళవారం పనికి వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు స్థానికంగా, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కూతురి అదృశ్యంపై తల్లి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘణపురానికి వీడని గ్రహణం

రూ.55.32 కోట్లు మంజూరైనా.. పూర్తి కాని పనులు

పాపన్నపేట(మెదక్): దేవుడు వర మిచ్చినా.. పూజారి కనికరించలేదన్నట్లుంది ఘనపురం ప్రాజెక్టు పరిస్థితి. జిల్లాలోని ఏకైక మధ్య తరహా ప్రాజెక్టు కింద మహబూబ్ నహర్, ఫతేనహర్ కెనాళ్లు ఉన్నాయి. ప్రాజెక్టు నిల్వ నీటి సామర్థ్యం 0.2 టీఎంసీలు. ప్రస్తుతం పూడికకు గురి కావడంతో 0.134 టీఎంసీలకు పడిపోయింది. నిర్దేశిత ఆయకట్టు 23,125 ఎకరాలు ఉన్నా మంజీరా తీర ప్రాంత పొలాలతో కలిసి సుమారు 30 వేల ఎకరాలు సాగు అవుతోంది. 120 ఏళ్ల చరిత్ర గల ప్రాజెక్టుకు తొలిసారి ఆధునీకరణ కోసం 2022లో రూ.55.32 కోట్లు మంజూరు చేశారు. ఇప్పటి వరకు దాదాపు రూ.20 కోట్ల పనులు పూర్తి అయ్యాయి. మహబూబ్‌నహర్ కెనాల్ పనులు పూర్తి అయినా ఫతేనహర్ కెనాల్ వైపు అబ్లాపూర్, అన్నారం, కుర్తివాడ, దౌలాపూర్, మిన్‌పూర్ కాలువలకు లైనింగ్, గైడ్‌వాల్స్, తూముల రిపేర్లు జరగాల్సి ఉంది. 2011లో జైకా పథకం కింద మంజూరైన రూ.24.08 కోట్ల పనులు పూర్తి అయినా పదేళ్లలోనే అవి శిథిలమవుతున్నాయి. దీంతో గైడ్‌వాల్ రాళ్లు కాల్వల్లో పడి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్నాయి. నాగ్సాన్‌పల్లి ప్రధాన కాలువ లోతుగా ఉంది. అది పిచ్చి మొక్కలతో నిండిపోయింది. కనీసం నీటి ప్రవాహం కూడా కనిపించని పరిస్థితి. తూములు సరిగా లేక నీరు సక్రమంగా ప్రవహించడం లేదు. మిన్‌పూర్ నుంచి కుర్తివాడ కోమటి చెరువు వరకు కెనాల్‌కు మూడు చోట్ల గండ్లు ఉన్నట్లు రైతులు వాపోయారు. చివరి ఆయకట్టు రైతులు అనాదిగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం వచ్చినా మరమ్మతులు పూర్తి కాలేదు. తాత్కాలిక మరమ్మతుల కోసం ఎలాంటి ప్రతిపాదనలు పంపలేరు.



నాగ్సాన్‌పల్లి గుట్ట వద్ద ఫతేనహర్ కెనాల్ లో పిచ్చి మొక్కలు

> **అత్యవసరమైన చోట మరమ్మతులు**
>
> ఘణపురం ఆనకట్ట ఆధునీకరణ కోసం మంజూరైన నిధుల నుంచి సుమారు 50 శాతం పనులు ఎంఎన్ కెనాల్ వైపు పూర్తి కాగా, ఎఫ్ఎన్ కెనాల్ వైపు మిగిలిపోయాయి. వర్షాకాలం ఆరంభం కావడంతో పూర్తి చేయలేక పోయాం. అత్యవసరమైన చోట మరమ్మతులు చేపడుతాం.
>
> – శివనాగరాజు, డీఈఈ, ఇరిగేషన్



పాపన్నపేట : కూలిన ఫతేనహర్ గైడ్ వాల్

ప్రాజెక్టులిలా.. వరదొస్తే ఎలా?

ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులు ఈ యేడు వర్షాకాల మరమ్మతులకు నోచుకోలేదు. ఈ ప్రాజెక్టుల పరిధిలో తూముల నిర్వహణ సరిగా లేదని రైతులు చెబుతున్నారు. కెనాల్ వద్ద గండ్లు పడ్డాయని, సాగునీటి కోసం కట్ట పనులు చేపట్టడం లేదని, గైడ్‌వాల్, తదితర పనులు అసంపూర్తిగానే ఉన్నాయని విమర్శిస్తున్నారు. ఇంకా కాల్వల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయని, గైడ్‌వాల్ నుంచి పడిపోయిన రాళ్లు కాల్వల్లోనే ఉన్నాయని పేర్కొంటున్నారు. ఈ పనులు ఎప్పుడు పూర్తి చేస్తారని ప్రశ్నిస్తున్నారు. వరదలొస్తే పంటల పరిస్థితి ఏమిటి? అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

‘నారింజ’కు.. నిధులు కరువు

రూ.3.50 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు



నారింజ ప్రాజెక్టు

జహీరాబాద్: మండలంలోని కొత్తూర్(బి) గ్రామశివారులో గల నారింజ ప్రాజెక్టు మరమ్మతుకు నిధుల కేటాయింపుల్లో జాప్యం జరుగుతోంది. రెండేళ్ల క్రితం ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. తాజాగా పక్షం రోజుల క్రితం నీటి పారుదల శాఖ అధికారులు రూ.3.50 కోట్ల అంచనాలతో ప్రతిపాదించారు. నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ప్రాజెక్టు షట్టర్లను మార్చాల్సి ఉంది. వాటిని ఎత్తేందుకు వీలుగా ఉన్న జనరేటర్ సైతం మరమ్మతులకు వచ్చింది. ప్రాజెక్టు చుట్టు కట్ట ఎత్తు పెంచాల్సిన అవసరం ఉంది. ఆయకట్టుకు నీటిని అందించే తూములు, అలుగు మరమ్మతులు అవసరం ఉంది. నీటి సాగు కోసం కట్ట కాలువ నిర్మాణం చేయాల్సి ఉంది. యాంత్రిక మరమ్మతులు, ట్రాక్ మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టు ఆయకట్టుకు నీటిని అందించలేకుండా ఉంది. 0.85 ఎంసీఎఫ్‌టీ సామర్థ్యం కలిగి ఉన్న ప్రాజెక్టు ప్రస్తుతం పరిసర గ్రామాల్లో నీటి ఊటలు పెంచేందుకు మాత్రమే ఉపయోగపడుతోంది.

తూము నుంచి నీరు వృథా



వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలోని కుడిచెరువు తూము నుంచి నీరు వృథాగా పోతోంది. దాని పక్కనే ఏర్పడిన గండి వల్ల సుమారు రెండేళ్లుగా నీరు కిందకు పోతోంది. నీటి వృథాతో చెరువుకట్టకు ప్రమాదం పొంచి ఉంది. ఆయకట్టు రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని మరమ్మతులు చేపట్టాలని గతంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశాల్లో ప్రజాప్రతినిధులు సమస్యను పలుమార్లు లేవనెత్తినా సమస్య నేటికీ పరిష్కారానికి నోచలేదు.

> **ఏజెన్సీ లేకపోవడం వల్లే..**
>
> కుడిచెరువు తూము మరమ్మతు పనులను చేపట్టడానికి ఏజెన్సీ లేకపోవడం వల్లే కొంత జాప్యం జరిగింది. పనులు చేపట్టడానికి మాజీ ప్రజాప్రతినిధులు ముందుకు రాలేదు. త్వరలో పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. మరమ్మతు పనులకు సంబంధించి నిధుల విడుదలకు గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.
>
> – రాజేందర్, ఇరిగేషన్, డీఈ

నల్లవాగు.. కట్టపై పగుళ్లు..

కల్హేర్(నారాయణఖేడ్): ఉమ్మడి మెదక్ జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టు నల్లవాగు ఆయకట్టు కింద రైతులకు కష్టాలు తీరడం లేదు. ప్రాజెక్టు కట్టపై పగుళ్లు ఏర్పడ్డాయి. మరమ్మతుకు నోచడం లేదు. సమైక్యాంధ్ర పాలనలో నాటి ప్రభుత్వం నల్లవాగు కాల్వల సీసీ లైనింగ్ కోసం రూ. 14 కోట్లు మంజూరు చేసింది. పనుల నాణ్యత లేకపోవడంతో కాల్వల పరిస్థితి అధ్వానంగా తయారైంది. తెలంగాణ వచ్చాక 2017లో ప్రభుత్వం రూ. 24.14 కోట్లు మంజూరు చేసింది. ఆధునీకరణ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ఆయకట్టు రైతుల కష్టాలు ఎక్కడ వేసిన గొంగళి అన్నట్లు ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఎమ్మెల్యే సంజీవరెడ్డి చొరవతో ఇటీవలే కాంట్రాక్టర్ తిరిగి పనులు ప్రారంభించారు. కాల్వల సీసీ లైనింగ్ పనులు చేపట్టారు. గైడ్‌వాల్, తదితర పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. కాల్వల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. గైడ్‌వాల్ నుంచి పడిపోయిన రాళ్లు కాల్వల్లోనే ఉన్నాయి.



నల్లవాగు ప్రాజెక్టు గైడ్‌వాల్‌కు ఏర్పడిన పగుళ్లు

9, 10 గేట్ల పనులు

పుల్‌కల్(అందోల్): వరదలను తట్టు కోవడానికి డ్యామ్ పటిష్టత కోసం సింగూరు ప్రాజెక్టుకు మరమ్మతులు చేపడుతున్నారు. క్రస్ట్‌గేట్ల రబ్బర్ గ్రీజింగ్ కోసం రూ. 15 లక్షలు వెచ్చించి పనులు చేస్తున్నారు. ఏటా 17 క్రస్టుగేట్ల గ్రీజింగ్ చేయించి మరమ్మతు చేస్తారు. ఈ సీజన్‌లో 9, 10 గేట్లను ఎంపిక చేసి క్రస్టు గేట్లకు, వాటి ఎత్తు రూప్‌లకు మరమ్మతు చేస్తున్నారు. సీజన్ మరమ్మతుల కోసం రూ.15 లక్షలను కేటాయించారు. డ్యాం వద్ద యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తున్నారు. మట్టి కట్టపై నున్న పిచ్చి మొక్కలను వేసవిలో తొలగించారు. దీంతో గేట్ల నుంచి నీరు లీకేజీ కాకుండా నివారిస్తారు.



గేట్ల రూప్‌లకు మరమ్మతు చేస్తున్న సాంకేతిక నిపుణుడు

పంచాయితీ పెడతారని..

ప్రేమికుడి ఆత్మహత్య



విష్ణు(ఫైల్)

కల్హేర్(నారాయణఖేడ్): గ్రామంలో జరిగిన గొడవ కారణంగా పంచాయితీ పెడుతారనే భయంతో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని మహదేవుపల్లి శివారులో జరిగింది. కల్హేర్ ఏఎస్ఐ అంజయ్య కథనం ప్రకారం... నారాయణఖేడ్ మండలం అనంతసాగర్‌కు చెందిన బేగరి విష్ణు (22) హైదరాబాద్‌లో కారు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. సొంత గ్రామమైన అనంతసాగర్‌లో ఓ యువతితో ప్రేమ వ్యవహారం సాగిస్తున్నాడని గ్రామస్తులు పిలిచి పంచాయితీ జరిపేందుకు నిర్ణయించారు. దీంతో మనస్తాపం చెందిన అతను మూడు రోజుల క్రితం మహదేవుపల్లి శివారులో సంగారెడ్డి–నాందేడ్ 161 జాతీయ రహదారి పక్కన చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయింది. స్థానికులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ అంజయ్య తెలిపారు.

అప్పుల బాధతో రైతు..

నంగునూర్(సిద్దిపేట): అప్పులు తీర్చే మార్గం తెలియక మనస్తాపంతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం ... మండలంలోని కొనాయి పల్లికి చెందిన మల్లమారి బాబు (49).. ఒకే ఏడాదిలో అతని తల్లిదండ్రులు చనిపోయారు. అప్పటికే రూ.2 లక్షల అప్పు ఉంది. మరో వైపు ఇంటి మరమ్మతులకు గాను మొత్తంగా రూ. 5 లక్షలు తేలాయి. ఇవి ప్రైవేటు ఫైనాన్స్‌లో తీసుకున్నాడు. తీర్చే మార్గం దొరకక ఈనెల 22న ముండ్రాయి గ్రామ శివారులో వ్యవసాయ బావి వద్ద గడ్డి మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆయన బంధువు సాయి కిరణ్ గుర్తించి 108 ద్వారా సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాబు బుధవారం చనిపోయాడు. కుమారుడు రఘు ఫిర్యాదు మేరకు రాజగోపాల్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వడ్డేపల్లికి రేషన్ బియ్యం

స్వాధీనం చేసుకున్న పోలీసులు



పట్టుబడిన పీడీఎస్ బియ్యం

మిరుదొడ్డి(దుబ్బాక): అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని మండల పరిధిలోని అల్వాల వద్ద పట్టుకున్నట్టు ఎస్ఐ బోయిని పర్శరాములు తెలిపారు. బుధవారం వాహనాల తనిఖీలు చేస్తుండగా డీసీఎంలో 144 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్టు గుర్తించామన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి నుంచి దౌల్తాబాద్ మండలం వడ్డేపల్లికి బియ్యం తరలిస్తున్నట్టు తెలిసిందన్నారు. దీనిపై సివిల్ సప్లయి అధికారులకు సమాచారం అందిస్తే సంఘటన స్థలానికి చేరుకొని డీసీఎంను గోదాంకు తరలించారు.

కులగణన చేసే వరకు పోరు

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



సంఘీభావం తెలుపుతున్న బీసీ నాయకులు

సంగారెడ్డి: బీసీ కుల గణన చేసే వరకు పోరాటం ఆగదని, వారంతా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని సంక్షేమ సంఘం సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రం సంగారెడ్డిలో బీసీ కుల గణన సాధన యాత్ర సభ ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపల్లి పాండు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధాని మోదీ.. బీసీ బిడ్డనని పబ్బం గడుపుకుంటున్నారన్నారు. పదేళ్లలో వారికి ఆయన చేసింది ఏమీ లేదన్నారు. దేశంలో 70 కోట్ల మందికి బడ్జెట్‌లో సైతం గుండు సున్నా పెట్టారన్నారు. మార్పు కావాలి కాంగ్రెస్ రావాలని కాంగ్రెస్‌ను తెచ్చుకుంటే వారు కూడా వారిని మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా న్యాయం జరగడం లేదన్నారు. బీసీల్లో మార్పు వస్తేనే న్యాయం జరుగుతుందన్నారు. కులగణనను వెంటనే ప్రారంభించాలని రేవంత్ రెడ్డికి డిమాండ్ చేశారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మణిమంజరి మాట్లాడుతూ, కేవలం బీసీల కులగణన స్వాతంత్ర్యం రాక ముందు చేశారని గుర్తు చేశారు. విద్యార్థులు, యువతకు ఈ విషయమై అవగాహన కల్పించాలని కోరారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుక్కలచేర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ కులగణన కోసం రాష్ట్ర మంతటా పర్యటనలు చేస్తూ బీసీలను శ్రీనివాస్ జాగృతం చేస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర చైర్మన్ కుందారం గణేశ్ చారి, తాటిపల్లి పాండు, జిల్లా అధ్యక్షుడు యాదగిరి, నాయకులు గోరుగంటి రమేశ్, జగదీశ్, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

బావిలో పడి ఒకరు.. విద్యుదాఘాతానికి గురై మరొకరు

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి



రాజు(ఫైల్)

చేగుంట(తూప్రాన్): ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండల కేంద్రమైన చేగుంటలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంటకు చెందిన పుల్లబోయిన రాజు(40) వ్యవసాయ బావిలో మోటార్ పాడైపోవడంతో రెండు రోజుల క్రితం మోటార్‌ను బయటకు తీయించి రిపేర్ కోసం ఇచ్చాడు. కేబుల్ బావిలోనే ఉండిపోవడంతో బుధవారం సాయంత్రం కేబుల్ వైరును బయటకు తీసేందుకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లిన రాజు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో అనుమానంతో కుటుంబీకులు బావి వద్దకు వెళ్లి చూడగా రాజు బావిలో పడి మృతిచెంది ఉన్నాడు. గ్రామస్తుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ బాలరాజు చేరుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రామాయంపేట(మెదక్): విద్యుదాఘాతానికి గురై గిరిజన రైతు మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని పర్వతాపూర్ పంచాయతీ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బాయనయ్య మోతుకుల తండాకు చెందిన గిరిజన రైతు కాట్రోత్ లక్మా (48) బుధవారం కరెంటు షాక్‌తో మృతిచెందాడు. ఉదయం బోరు వద్దకు వెళ్లిన అతనికి ప్రమాదవశాత్తు కేబుల్ వైరు చేతికి తగిలి షాక్‌తో మృతిచెందాడు. సమీపంలో ఉన్నవారు గమనించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

మెదక్ మున్సిపాలిటీ: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసినట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఓ కేసులో మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు నీరుడి రాము, ఎం.రవిలు ఓ అర్జీదారుడి నుంచి డబ్బులు తీసుకున్నట్లు ఫిర్యాదు అందిందని తెలిపారు. ఈ విషయమై విచారిస్తే నిజమని తేలడంతో వారిని సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది ఎవరూ కూడా జిల్లాకు, పోలీస్ శాఖకు చెడ్డ పేరు తెచ్చేలా వ్యవహరించ కూడదని, అలా ఎవరైనా చేస్తే వారిపై శాఖా పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

లారీ డ్రైవర్‌కు జరిమానా

వర్గల్(గజ్వేల్): అతివేగంగా వాహనం నడిపి వ్యక్తి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు బుధవారం గజ్వేల్ కోర్టు న్యాయమూర్తి ప్రియాంక రూ. 10వేల జరిమానా విధించారని వర్గల్ మండలం గౌరారం ఎస్సై శివకుమార్ తెలిపారు. 2018లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహేందర్ కుమార్ తన లారీని అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ సింగాయపల్లి క్రాస్‌రోడ్డు వద్ద బైక్‌ను ఢీకొట్టాడన్నారు. ఈ ప్రమాదంలో వ్యక్తి మృతిచెందగా అప్పట్లో గౌరారం స్టేషన్లో అతడిపై కేసు నమోదైంది. నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి రూ.10,000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని పేర్కొన్నారు.

రుణం పొందకున్నా.. ‘మాఫీ’ మెసేజ్‌లా?

అవాక్కవుతున్న చెరుకు రైతులు ● 620 మందికి సందేశాలు

రుణం తీసుకోలేదు అయినా రుణమాఫీ అయినట్లు రైతులకు సందేశాలు వచ్చాయి. తాము ఎక్కడ అప్పు తీసుకున్నాం? అని సమాలోచనలో పడ్డారు. ఈ క్రమంలో చెరకు కర్మాగారానికి చేసిన అగ్రిమెంట్‌లో బ్యాంకు రుణపత్రాలపై సంతకాలు యాజమాన్యం తీసుకున్నారనే విషయం తెలుసుకొని అవాక్కవుతున్నారు. దీంతో కంపెనీకి లబ్ధిచేకూరుతుందని తమకు ఎలాంటి ప్రయోజనం కలగదని, న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.



ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

నారాయణఖేడ్: రుణం పొందకుండానే.. మాఫీ అయినట్లు ఫోన్‌లకు మెసేజ్ రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం మాగి చక్కెర కర్మాగారానికి నారాయణఖేడ్ ప్రాంత రైతులు చెరకును సరఫరా చేస్తారు. కర్మాగారం ఏర్పడ్డ 2007 నుంచి ఈ ప్రాంత రైతులతో కర్మాగారానికి చెరకును సరఫరా కోసం యాజమాన్యం అగ్రిమెంట్ చేసుకుంటుంది. అనంతరం రైతులకు పంట సాగు కోసం కర్మాగారం యాజమాన్యం చెరకు విత్తనం, ఎరువులు, ఇతర క్రిమిసంహారక మందులను సరఫరా చేస్తుంది. ఇందుకు సంబంధించిన డబ్బును చెరకును సరఫరా చేసిన అనంతరం రైతుల నుంచి రికవరీ చేసుకొని వారికి మిగతా సొమ్ము చెల్లిస్తుంది. కర్మాగారం అధికారులు రైతుల నుంచి అగ్రిమెంట్ చేసుకునే సమయంలో బ్యాంకు రుణ పత్రాలపై కూడా సంతకాలు తీసుకొని రైతుల పేరిట బ్యాంకు నుంచి కర్మాగారం వారు రుణాలు పొందుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల లోపు రుణ మాఫీ చేయడంతో మొదటి విడుతలో లక్ష లోపు రుణం ఉన్న వారికి మాఫీ చేశారు. నిజామాబాద్‌లోని యూనియన్ బ్యాంకు శాఖ నుంచి అనేక మంది రైతులకు రుణమాఫీ అయినట్లు మెసేజ్‌లు వస్తున్నాయి. అవాక్కయిన రైతులు తాము బ్యాంకు నుంచి నేరుగా రుణం పొందకపోయినా, రుణ మాఫీ అయినట్లు. మెసేజ్ లో వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు.

అగ్రిమెంట్‌లో సంతకాలు

ఈ విషయమై మాగి చక్కెర కర్మాగారం జీఎం వెంగల్ రెడ్డిని విలేకరులు వివరణ కోరగా.. తాము కర్మాగారం ఏర్పాటు చేసినప్పటి నుంచి రైతుల నుంచి అగ్రిమెంట్ చేసుకొనే క్రమంలోనే బ్యాంకు రుణపత్రాలపై కూడా సంతకాలు తీసుకొని, రైతులకు అవసరమగు ఎరువులు, విత్తనాలు, ఇతర సదుపాయాలు కల్పిస్తామన్నారు. తమ యాజమాన్యం బ్యాంకు నుంచి రైతుల పేరిట పొందిన రుణాన్ని చెరకును సరఫరా చేసిన అనంతరం వారి నుంచి అడ్వాన్స్‌గా అందించిన ఎరువులు, విత్తనాలు, ఇతర సౌకర్యాలకు సంబంధించిన సొమ్మును రికవరీ చేసి బ్యాంకులకు చెల్లిస్తామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రుణమాఫీ చేయడంతో రైతుల ఆధార్ కార్డులను లింక్ చేయడం వల్ల రుణమాఫీ మెసేజ్‌లు రైతులకు వెళ్తున్నాయన్నారు. ఈ విషయాన్ని యాజమాన్యం బ్యాంకర్లతోను చర్చిస్తుందని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరిస్తామన్నారు.

> **సందేశాలు వచ్చింది వీరికే..**
>
> మనూరు మండలం అతిమ్యాల్‌లోని 120 మంది రైతులకు ఈ విధంగా మెసేజ్‌లు వచ్చాయి. తమకు రుణం అందకున్నా మాఫీ అయినట్లు మెసేజ్ రావడంతో ఎక్కడ నష్టపోతామోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో దాదాపు 500 మందికి పైగా రైతులకు ఈ విధంగా రుణమాఫీ మెసేజ్‌లు వచ్చాయని పలువురు తెలిపారు. కర్మాగారం యాజమాన్యం ఈ విధంగా చేయడంతో రుణమాఫీ వల్ల తమ కంటే కర్మాగారం యాజమాన్యానికే అధిక ప్రయోజనం చేకూరుతుందని, ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న రిలే దీక్షలు



రిలే నిరాహార దీక్షలో రైతులు

నర్సాపూర్: రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 13వ రోజుకు చేరాయి. దీక్షలో చెన్నాపూర్, చిన్నచింతకుంట, పెద్దచింతకుంట, లింగాపూర్ గ్రామాల రైతులు నర్సింహరెడ్డి, నారాయణ, అంజయ్య, అంజాగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, కిషన్, శ్రీశైలం యాదవ్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే భవిష్యత్



గుంతలు తీయిస్తున్న ఎంపీడీఓ, ఏపీఓ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మొక్కల పెంపకంతోనే ముందుతరాలకు భవిష్యత్ ఉంటుందని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. బుధవారం ఆయన ఏపీఓ శ్యామ్‌తో కలిసి చిలప్‌చెడ్ మండలంలోని గౌతాపూర్ నూతన పాఠశాల భవనం ఆవరణలో వనమహోత్సవం మొక్కలు నాటేందుకు గుంతలు తీయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా మొక్కలు నాటుతున్నామని, నాటిన ప్రతీ మొక్కను కాపాడాలని సూచించారు. అదే విధంగా ఇంటింటికీ పంపిణీ చేసిన మొక్కలను నాటి, బాధ్యతగా సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ భవాన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాల సీజ్



పాఠశాలను సీజ్ చేస్తున్న ఎంఈఓ

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలో ప్రభుత్వ గుర్తింపు రద్దు చేసిన లేక్ వ్యూ టాలెంట్ పాఠశాలను ఎంఈఓ నీలకంఠ సీజ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా నడుపుతున్న ప్రైవేట్ పాఠశాల గుర్తింపును జిల్లా విద్యాశాఖ అధికారి గత నెలలో రద్దు చేశారు. అయినప్పటికీ యాజమాన్యం పాఠశాలను నడుపుతుండడంతో ఎంఈఓ సిబ్బందితో కలిసి వెళ్లి పాఠశాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పాఠశాల గుర్తింపు రద్దు చేయడం వల్ల విద్యార్థుల పేర్లు యుడైస్‌లో నమోదు కావని, విద్యార్థుల తల్లిదండ్రులు ఎట్టి పరిస్థితుల్లోను పిల్లలను ఈ పాఠశాలలో చేర్పించొద్దన్నారు. పాఠశాలను తిరిగి నడిపించాలన్న యాజమాన్యం ప్రభుత్వ గుర్తింపును తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ సాయికుమార్ ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. బుధవారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో దోమలు రాకుండా పిచ్చిమొక్కలు తొలగిస్తూ, ఫాగింగ్ చేయాలన్నారు. మురికికాల్వల చుట్టూ బ్లీచింగ్ చేయించాలన్నారు. గ్రామాలను వందశాతం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్యామ్, ఏంపీఓ శరత్‌కుమార్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న టమాటా పంట



ఎండిన మొక్కలు చూపుతున్న బాధిత రైతు

రామాయంపేట(మెదక్): టమాటా పంట సాగు చేసిన రైతు వ్యాపారి వైఖరితో పంట మొత్తం నష్టపోయాడు. వివరాల్లోకి వెలితే.. మండలంలోని సుతారిపల్లి గ్రామానికి చెందిన రైతు చెన్నబోయిన సిద్ధరాంలు ఎకరం భూమిలో టమాటా పంట వేశాడు. పంటచేలకు పురుగు ఆశించగా, దౌల్తాబాద్‌లో ఒక వ్యాపారి వద్ద క్రిమి సంహారక మందు తెచ్చి ఆయన సూచన మేరకు పంటపై స్ప్రే చేశాడు. మందు పిచికారీ చేసిన నాలుగైదు రోజులకే పూతతో పాటు కాయలు మొత్తం రాలిపోయి, మొక్కలు కూడా మాడిపోయాయి. ఈసారి టమాటా ధర అధికంగా ఉండటంతో అధిక లాభాలు ఆశించి రూ. లక్షన్నర ఖర్చుపెట్టి పంట సాగు చేసి నష్టపోయానని బాధితరైతు వాపోయాడు. ఈవిషయమై ఆయన వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేశాడు. సదరు వ్యాపారి ఎక్కువ డోస్ మందు ఇవ్వడంతో పంట దెబ్బతిన్నదని వ్యవసాయ అధికారి పేర్కొన్నారు. నష్టపోయిన తనను ఆదుకోవాలని బాధిత రైతు విజ్ఞప్తి చేశాడు.

కుక్కల వీరవిహారం

- వాహనదారులపై దాడులు చేస్తున్న వీధి శునకాలు
- చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్న ప్రజలు



బండపోతుగల్‌లో గుంపులుగుంపులుగా తిరుగుతున్న కుక్కలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాల్లో పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా గ్రామాల వీధుల్లో, వాహనాలపై వస్తున్న వారిపై దాడులు చేస్తున్నాయి. పలు ఘటనలో ప్రజలు గాయాల బారిన పడుతున్నారు. కుక్కలను నివారించేలా ఆయా గ్రామాల పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. చిలప్‌చెడ్ మండల కేంద్రంతో పాటు, బండపోతుగల్, అజ్జమర్రి, సోమక్కపేట్, చండూర్, చిట్కుల్ గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. మండల వ్యాప్తంగా వందల సంఖ్యలో పిచ్చి కుక్కలు తిరుగుతున్నాయి. బైక్‌పై వెళ్తున్న వారిని కుక్కలు వెంబడించి మరీ కరుస్తున్నాయి. కుక్కలు వెంట పడుతుండటంతో వేగంగా బైక్‌పై వెళ్తున్న వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కేవలం ప్రజలపై మాత్రమే కాకుండా చండూర్ గ్రామంలో గొర్రెలపై దాడి చేసిన కుక్కలు గొల్లకురుమలకు తీవ్రంగా నష్టం కలిగించిన సందర్భాలున్నాయి. ఈ మధ్య కాలంలో పిచ్చి కుక్క దాడిలో బండపోతుగల్ గ్రామంలో ముగ్గురు, చండూర్ గ్రామంలో ఒక్కరు, సోమక్కపేట్ గ్రామంలో మరో ఇద్దరు గాయపడిన సందర్భాలున్నాయి. రాత్రి సమయాల్లో వాహనదారుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ప్రధాన రహదారులపై కుక్కలు గుంపుగుంపులుగా తిరుగుతూ ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. కుక్కల నుంచి తమను రక్షించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం ..



మూడు రోజుల క్రితం గ్రామంలో వెళ్తుంటే పిచ్చి కుక్క దాడి చేసి కరిచింది. జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నా. కుక్క కరవటంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. తగిన వైద్యం తీసుకుంటున్నా. వీధి, పిచ్చి కుక్కలను నివారించేలా అధికారులు, తగిన చర్యలు తీసుకోవాలి.

– కోటల నాగయ్య, బండపోతుగల్

అప్రమత్తంగా ఉండాలి



వీధి, పిచ్చి కుక్కలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పిచ్చిదైనా, మంచిదైనా కుక్క కరిచిన, గీరినా 24 గంటలలోపు అంటీ రేబీస్ టీకా వేయించుకోవాలి. కక్క కరిస్తే పసుపు, కారం, మట్టి లాంటివి పెట్టొద్దు. గాయం మానేందుకు వాతలు పెట్టొద్దు. పీహెచ్‌సీ పరిధిలో కుక్క కాటుకు నయమయ్యేందుకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

– ప్రవీణ్, వైద్యాధికారి, కౌడిపల్లి

వివాద భూమిలోకి వస్తే చర్యలు

అల్లాదుర్గం సీఐ రేణుక



తండా ప్రజలతో మాట్లాడుతున్న సీఐ రేణుక

టేక్మాల్(మెదక్): వివాద భూమిలోకి ఎవరు అడుగు పెట్టినా.. శాఖాపరమైన చర్యలు తప్పవని అల్లాదుర్గం సీఐ రేణుక హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు, రెవెన్యూ అధికారులు భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణను పరిష్కరించేందుకు బుధవారం మండలంలోని షాబాద్‌తండాను సందర్శించారు. ప్రభుత్వ భూమి 86 సర్వేనంబర్‌లో షాబాద్‌తండా, నల్లకుంటతండా ప్రజల ఒకరి భూమిలోకి మరొకరు వచ్చారంటూ కొన్ని రోజులుగా భూ వివాదం జరుగుతోంది. ఈ విషయంలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోగా.. పలువురిపై కేసులు నమోదయ్యాయి. తండాను అల్లాదుర్గం సీఐ రేణుక, ఎస్‌ఐ మురళి, డిప్యూటీ తహసీల్దార్ కిషోర్, ఆర్‌ఐ సాయి శ్రీకాంత్ చేరుకొని భూమి అంతా తిరుగుతూ పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రెండు వర్గాలకు చెందిన పెద్ద మనుషులు వచ్చి పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుకొని గొడవలను పరిష్కరించుకోవాలని సూచించారు. అధికారుల మాటలు బేఖాతరు చేస్తూ అల్లార్లు చేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రేణుక హెచ్చరించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



ప్రభుత్వ పాఠశాల వద్ద మరమ్మతులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

నర్సాపూర్: వర్షాకాలం వ్యాధుల సీజన్ కావడంతో ప్రజలు తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ పేర్కొన్నారు. ఆయన బుధవారం పట్టణంలోని ఒకటవ, నాల్గవ వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మురికి కాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. నాల్గవ వార్డులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించి వారికి సూచనలు చేశారు. ఆయన వెంట నాల్గవ వార్డు కౌన్సిలర్ యాదగిరి తదితరులు ఉన్నారు. అనంతరం మున్సిపల్ సిబ్బందితో కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సమావేశం నిర్వహించారు. వర్షాకాలం సీజన్ కావడంతో జాగ్రత్తగా ఉండాలని పారిశుద్ధ్యం పనులు సక్రమంగా చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ మధుసూదన్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

బీజేపీ నాయకులు



మాట్లాడుతున్న రాజు

చిన్నశంకరంపేట(మెదక్): రైతులందరికీ షరతులే కుండా రుణమాఫీ చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు పోగుల రాజు డిమాండ్ చేశారు. బుధవారం చిన్నశంకరంపేటలో మండల బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీని సత్వరం పూర్తిచేయడంతో పాటు రైతు భరోసా అందించి రైతులకు మేలు చేయాలన్నారు. రఘునందన్‌రావు గెలుపు కోసం కృషిచేసిన ప్రతీ ఒక్కరికి పార్టీ రుణపడి ఉందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా అధికారి ప్రతినిధి నందారెడ్డి, బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా మాజీ అధ్యక్షుడు మల్లారెడ్డి, మహిళా, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ మోర్చా అధ్యక్షురాలు మంజుల మూర్తి శంకర్, స్వామి, నరేష్‌నాయక్, బీజేవైఎం నాయకులు మధు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

రేగోడ్(మెదక్): రైతులందరికీ రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రమేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రం రేగోడ్‌లో బుధవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కేటీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ కార్డుతో సంబంధం లేకుండా ప్రతీ రైతుకు పాట్టా పాస్‌పుస్తకం ఆధారంగా రుణమాఫీ చేయాలని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఉన్న 13 పథకాలు వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు రవీందర్, మాజీ సర్పంచ్ నర్సింలు, మాజీ ఎంపీటీసీ నర్సింలు, గ్రామ పార్టీ అధ్యక్షుడు సుభాశ్, శంకర్, అంబయ్య, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించని హోటళ్లకు జరిమానా



హోటల్‌లో తినుబండారాలు పరిశీలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

రామాయంపేట(మెదక్): పట్టణంలో బుధవారం మున్సిపల్ అధికారులు పలు హోటళ్లు, స్వీట్ హౌజ్‌లపై దాడులు చేసి, జరిమానా విధించారు. పరిశుభ్రత పాటించనందుకు గాయత్రి మెస్, బ్ల్యూ డైమండ్, బాలాజీ స్వీట్ హౌజ్, లక్ష్మీనర్సింహ ఫాస్ట్ ఫుడ్ సెంటర్, శ్రీరామ టిఫిన్ సెంటర్లకు రూ. 13 వేలు జరిమానా విధించినట్లు మున్సిపల్ కమిషనర్ దేవేందర్ తెలిపారు. అన్ని హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, బేకరీల్లో నాణ్యతతో పాటు పరిశుభ్రత పాటించకపోతే జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు.

ల్యాప్‌టాప్ బహూకరణ



తూప్రాన్: మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా గిఫ్ట్ ఏ స్మైల్ కింద తూప్రాన్ పట్టణానికి చెందిన చెలిమిల మమతకు బుధవారం ఆయన ల్యాప్‌టాప్ బహూకరించారు. తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ మాజీ చైర్మన్, సోషల్ మీడియా కన్వీనర్ జగన్మోహన్‌రావు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా ల్యాప్‌టాప్‌లను బహూకరించారు. ప్రస్తుతం విద్యార్థిని మమత జేఈఈ మెయిన్స్‌కు ప్రిపేర్ అవుతున్నట్లు తెలిపారు.

సప్తహ్‌లో విద్యార్థులకు క్రీడలు



విద్యార్థులకు పుంగిరిపూత ఆట ఆడిస్తున్న పీఈటీ నర్సింలు

టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో శిక్ష సప్తహ్ కార్యక్రమంలో భాగంగా మూడోరోజు అయినా బుధవారం స్పోర్ట్స్‌డే నిర్వహించారు. విద్యార్థులకు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నర్సింలు మన దేశీయ క్రియాశీల క్రీడల గురించి వివరించారు. గిల్లి దండా, సర్కిల్ కర్చీఫ్ గేమ్, పుంగిరి పూత, వంగుడు దూకుడు, యోగా, చింత గింజల ఆట, పులి జీతం, ఓమను గుంతలు, చదరంగం, క్యారమ్స్, గోలీలాట, ఇసుక లోపుల్ల, దాగుడుమూతలు వంటి ఆటలు ఆడిస్తూ వాటి ప్రాముఖ్యత, ఉపయోగాలను తెలిపారు. తద్వారా శరీరక, మానసిక ఒత్తిడి అలసటను క్రీడలు దూరం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, ఉపాధ్యాయులు నాగేందర్, శ్రీధర్, అశోక్, మోహన్, తదితరులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- మెదక్ ఆర్డీఓ రమాదేవి



మాట్లాడుతున్న ఆర్డీఓ రమాదేవి

అల్లాదుర్గం(మెదక్): ఇష్టారాజ్యంగా విధులకు సిబ్బంది అనే శీర్షికతో మంగళవారం సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన మెదక్ ఆర్డీఓ రమాదేవి బుధవారం అల్లాదుర్గం తహసీల్దార్ కార్యాలయం తనిఖీ చేశారు. ఆర్డీఓ వస్తుందని ముందే సమాచారం రావడంతో సిబ్బంది సమయానికి కార్యాలయానికి చేరుకొని విధులు నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తుండగా 11:50 గంటలకు గిర్దవర్ విధులకు రావడం గమనార్హం. ఆలస్యంగా వచ్చి ఆర్డీఓ రివ్యూలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది సమయ పాలనతో విధులు నిర్వర్తించాలని, విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వారికి అందుబాటులో ఉండాలన్నారు. ధరణిలో ఏ సమస్యలు పెడింగ్‌లో లేవన్నారు. రైతుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీశ్, డిప్యూటీ తహసీల్దార్ పాల్గొన్నారు.

దారి ఏర్పాటుకు చర్యలు



గ్రామస్తులతో చర్చిస్తున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని బిజ్లిపూర్ గ్రామంలో తలెత్తిన గొడవలపై బుధవారం అధికారులు గ్రామంలో చర్చించారు. గతంలో ఆలయాలకు, పొలాలకు వెళ్లేందుకు దారి ఉండడంతో నెల రోజుల క్రితం దారికి సంబంధించిన స్థలం పట్టా భూమి సర్వే నంబర్ 268లో ఉందని సదరు వ్యక్తులు అభ్యంతరం తెలపడంతో గ్రామస్తులు ఆందోళన చేశారు. ఈ విషయంపై గ్రామస్తులు, రెవెన్యూ కార్యాలయంతో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, ఎస్‌ఐ మహిపాల్ రెడ్డి, ఆర్‌ఐ కిషన్, సర్వేయర్ కార్తీక్ గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. పట్టాదారులు, గ్రామస్తులతో చర్చించి ప్రధాన రోడ్డు నుంచి ఆలయం వరకు 30 ఫీట్ల రోడ్డుతో పాటు ఆలయం చుట్టూ బండ్లు, బోనాలు తిరిగేందుకు 30 ఫీట్లు, పొలాలకు వెళ్లేందుకు 20 ఫీట్ల దారి వదిలేందుకు అధికారులు ఇరువర్గాలను ఒప్పించారు. ఆలయం వరకు మట్టి దారి ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కృష్ణ, రవీందర్‌చారి, ముత్యాలు, నవీన్, షేక్ చాన్, చంద్రయ్య, ఆంజనేయులు, బ్రహ్మచారి తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **బదిలీపై వచ్చిన కార్యదర్శులు**

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని ఐదు గ్రామాల పంచాయతీలకు బదిలీపై కొత్త కార్యదర్శులు విధుల్లో చేరారని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని గన్యాతండాకు గొల్యానాయక్, గౌతాపూర్ గ్రామానికి శ్రావణిసింధూజ, జగ్గంపేట గ్రామానికి కీర్తి, సామ్లాతండాకు వెంకటేశ్, శీలాంపల్లి గ్రామానికి సందీప్‌రెడ్డి వచ్చారన్నారు. కాగా ఇప్పటి వరకు ఈ గ్రామాల్లో విధులు నిర్వర్తించిన కార్యదర్శులు బదిలీలపై ఆయా గ్రామాలకు వెళ్లారన్నారు.

◆ **మట్టి అక్రమంగా తరలింపు**

నర్సాపూర్: ప్రభుత్వ భూమి నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. కొందరు వ్యక్తులు రాత్రి పూట మండలంలోని మాడాపూర్ ప్రభుత్వ భూమిలో ఉన్న గుట్టలను అక్రమంగా తవ్వి మట్టిని టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని తండా వాసులు తెలిపారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న విషయాన్ని మండలంలోని ఆయా శాఖల అధికారులకు చెప్పినా.. ప్రయోజనం లేదని వారు ఆరోపించారు. ఈవిషయమై మండల ఆర్‌ఐ ఫైజల్‌ను వివరణ కోరగా.. తన దృష్టికి రాలేదని, పరిశీలిస్తానని ఆయన చెప్పారు.

◆ **కేంద్రం పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

నిజాంపేట(మెదక్): కేంద్ర సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యపర్చాలని బీజేపీ జిల్లా నాయకుడు విజయకుమార్ పిలుపునిచ్చారు. బుధవారం నిజాంపేటలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నస్కల్, నిజాంపేట మధ్య తారురోడ్డు పనులు వెంటనే ప్రారంభించకపోతే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. నిజాంపేట మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

◆ **వర్షానికి కూలిన పూరి గుడిసె**



చిన్నశంకరంపేట(మెదక్): వారం రోజులుగా కురుస్తున్న వర్షంతో మండలంలోని రుద్రారం గ్రామంలో పూరి గుడిసె కూలింది. రుద్రారం గ్రామానికి చెందిన మాసాయిపేట సంగయ్య ఇద్దరు కుమారులతో కలిసి ఇదే పూరి గుడిసెలో నివాసం ఉంటున్నాడు. నిరుపేద అయినా సంగయ్య కుటుంబానికి నిల్వ నీడలేకుండా పోయిందని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామ కార్యదర్శి కార్యదర్శి కూలిన పూరిగుడిసెను పరిశీలించారు.

◆ **బైక్ షోరూంలో పోలీసుల తనిఖీలు**

వెల్దుర్తి(తూప్రాన్): పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలోని ఓ బైక్ షోరూంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించగా, సుమారు 14 ద్విచక్ర వాహనాలకు సంబంధించి పత్రాలు లేవని తెలిసింది. అదేవిధంగా అనుమతులు లేకుండా కొత్త వాహనాలను విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా క్రయ విక్రయాలు జరుపుతున్న సంబంధిత దుకాణాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఈ విషయమై ఎస్‌ఐ నవతను వివరణ కోరగా.. గురువారం ఉదయం వరకు వాహనాలకు పత్రాలు తీసుకురాకుంటే వాటిని సీజ్‌చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి, చర్యలు తీసుకుంటామని తెలిపారు.

◆ **విద్యార్థులు బాగా చదువుకోవాలి**

రామాయంపేట(మెదక్): విద్యార్థులు బాగా చదువుకోవాలని బీఆర్‌ఎస్ నియోజకర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. రామాయంపేటలో నూతనంగా ఏర్పడిన సంఘీక సంక్షేమశాఖ బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు తాగు నీటి వసతి నిమిత్తం రూ. 70 వేల చెక్కు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శిరీష, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు యాదగిరి, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

చేగుంట(తూప్రాన్): మండల వనరుల కేంద్రంలో మెసెంజర్‌గా పని చేసేందుకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈఓ బుచ్యానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి పాసై 21 ఏళ్లు దాటిన వ్యక్తులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

◆ **సన్మానం**

తూప్రాన్: పట్టణ పరిధిలోని అల్లాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం గ్రామస్తులు, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ 7వ వార్డు కౌన్సిలర్ భగవన్‌రెడ్డి, హేమలత, హెచ్‌ఎం లింగం, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **ఎంపీడీఓ, ఎంపీఓ బదిలీ**

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఎంపీఓ లక్ష్మీకాంత రెడ్డి బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. కాగా ప్రస్తుతం పాపన్నపేట ఎంపీడీఓ చార్జి మెదక్ ఎంపీడీఓ రఘుకు అప్పగించారు. ఎంపీఓ పోస్ట్ ఖాళీగా ఉంది.

◆ **పొలంలోకి దూసుకెళ్లిన ట్రాలీఆటో**

కౌడిపల్లి(నర్సాపూర్): ట్రాలీఆటో అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. కాగా ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ సంఘటన 765డీ జాతీయ రహదారిపై కౌడిపల్లి పెద్ద చెరువు కట్టవద్ద జరిగింది. నర్సాపూర్ నుంచి మెదక్ వైపు వెళ్తున్న ఆటో చెరువు కట్ట మూలమలుపువద్ద అదుపు తప్పి చెట్టును ఢీకొని వరి పొలంలోని దూసుకెళ్లింది.

◆ **టైర్ల కంపెనీపై చర్యలు తీసుకోండి**

చిన్నశంకరంపేట(మెదక్): దుర్వాసన వెదజల్లుతున్న టైర్ల కంపెనీపై చర్యలు చేపట్టి గ్రామరైతులకు మేలు చేయాలని మండలంలోని కామారం బీజేపీ గ్రామాధ్యక్షుడు రమేశ్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. కామారం గ్రామ శివారులో పాడైపోయిన టైర్లను కాల్చి ఆయిల్ తయారు చేసే పరిశ్రమతో తమకు కాలుష్య సమస్య ఉత్పన్నం అవుతుందన్నారు. దుర్వాసనతో పొలాల వద్దకు వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

◆ **రుణమాఫీ కోసం రైతుల దరఖాస్తులు**

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వం ఇటీవల రైతులకు రుణమాఫీ చేసింది. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కొంతమంది రైతులకు రుణమాఫీ జరగకపోవడంతో తమకు రుణమాఫీని వర్తింపచేయాలని కోరుతూ వ్యవసాయ కార్యాలయంలో 15 మంది రైతులు దరఖాస్తు చేశారని వ్యవసాయ అధికారులు తెలిపారు.

◆ **మెరుగైన వైద్యసేవలు అందించాలి**

కౌడిపల్లి(నర్సాపూర్): పల్లెదవాఖానాల్లో మెరుగైన వైద్యసేవలు అందించాలని మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని మహ్మద్‌నగర్ సబ్‌సెంటర్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. పల్లెదవాఖానలో వైద్యసేవలు, మందుల స్టాక్‌ను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు రాజమణి, మజీదబేగం తదితరులు పాల్గొన్నారు.

◆ **ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు**

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాలు తండాల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేశారు. చేగుంటలోని సుభాష్‌నగర్ కాలనీ, ఎస్సీ కాలనీ, శ్రీనివాస్ నగర్ కాలనీలో పారిశుద్ధ్య పనులను పంచాయతీ సిబ్బంది నిర్వహించారు. నడిమితండాతో పాటు చెట్లతిమ్మాయిపల్లిలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ ఆధ్వర్యంలో దోమల వ్యాప్తిని నిరోధించే మలాథియాన్ పిచికారీ చేయించారు.

◆ **రోడ్డుపై గుంతలు పూడ్చివేత**

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తి నుంచి మెదక్ వెళ్లే దారి నుంచి ఉప్పులింగాపూర్ వరకు రోడ్డుపై సుమారు 30కు పైగా గుంతలు ఉన్నాయి. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఉప్పులింగాపూర్ తాజామాజీ సర్పంచ్ భాగ్యమ్మ భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు సొంత డబ్బులతో రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

◆ **అక్కన్నపేటలో న్యాయ సేవా సదస్సు**

రామాయంపేట(మెదక్): మండలంలోని అక్కన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అతిథులుగా చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజీమున్నీసా బేగం, ప్యానెల్ అడ్వకేట్ కరుణాకర్, అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సిల్ సిద్ధాగౌడ్, పాల్గొన్నారు. మహిళా సాధికారిత, చైల్డ్‌కేర్ అండ్ ప్రొటెక్షన్, చైల్డ్ మ్యారేజెస్, విషయాలపై ప్రస్తావించడంతో పాటు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

◆ **రాష్ట్రంపై బీజేపీ కపట ప్రేమ**

టేక్మాల్(మెదక్): బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిపై కపట ప్రేమను చూపుతున్నాయని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు భక్తుల వీరప్ప మండిపడ్డారు. టేక్మాల్ చౌరస్తాలో ఆయన మాట్లాడారు. పార్టీ నాయకులు ఉన్నారు.

◆ **కేంద్రం రాష్ట్రానికి మొండి చేయి చూపింది**

రామాయంపేట(మెదక్): బడ్జెట్ కేటాయింపులో కేంద్రం రాష్ట్రానికి మొండి చేయి చూపిందని బీఆర్‌ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతి రెడ్డి ఆరోపించారు. ఆయన బుధవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. తెలంగాణకు బీజేపీ వివక్ష చూపుతుందని ఆరోపించారు.

◆ **నేడు టేక్మాల్ పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం**

టేక్మాల్(మెదక్): టేక్మాల్ పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై డైరెక్టర్లు గురువారం అవిశ్వాస పరీక్ష ప్రవేశపెట్టనున్నారు. ఈనెల 3న జిల్లా కో–ఆపరేటివ్ అధికారి కరుణకు డైరెక్టర్‌లు అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందించిన విషయం విదితమే.